



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4 PM
www.suryaa.com
శనివారం
26-07-2025
పేజీలు: 02




## మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ.. ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మృతి

మావోయిస్టులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌లోని గుమ్లాలో భద్రతా బలగాలు, మావోయిస్టులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. శనివారం ఉదయం గుల్మా జిల్లాలోని ఘాగ్రా అడవుల్లో భద్రతా బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు పక్షాలకు మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. దీంతో భద్రతా దళాల కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. వారిని సీపీఐ (మావోయిస్టు)కు చీలిక వర్గం జేజేఎంపీకి చెందిన వారిగా గుర్తించారు. ఆ ప్రాంతంలో ఆపరేషన్ ఇంకా కొనసాగుతున్నదని ఐజీ మిచెల్ ఎస్ రాజు వెల్లడించారు.

# మహావతార నరసింహ రివ్యూ

లేటెస్ట్ గా థియేటర్స్ లో రిలీజ్ కి వచ్చిన చిత్రాల్లో కన్నడ ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ వారు నిర్మాణం వహించిన భారీ యానిమేషన్ అండ్ డివోషనల్ చిత్రం "మహావతార నరసింహా" కూడా ఒకటి. మరి ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూ. ఇక కథల కి వస్తే కశ్యప ముని భార్యలలో ఒకరైనటువంటి దితి ఓనాడు కామ మోహితురాలై సరైన సమయం కానప్పటికీ కశ్యప మునితో సంగమిస్తుంది. ఇది తగిన సమయం కాదని వారించినా దానికి ప్రతిఫలం పుట్టే బిడ్డ రాక్షస అంశతో పుట్టే అవకాశం ఉందని చెప్పినా కూడా కశ్యపునితో సంగమిస్తుంది. అందుకు ప్రతిఫలంగా అత్యంత క్రూర కవలలు హిరణ్య కశిప, హిరాణ్యాక్షులు పుడతారు. వీరి అకృత్యాలకు అడ్డు ఉండదు. వీరిని మహా విష్ణువుకి శత్రువులుగా వారి గురువు శుక్రాచార్యుడు పెంచుతాడు. అప్పటికే అసురులలో మేటిగా నిలిచిన వీరిద్దరిలో విష్ణు అవతారాల్లో ఒకటైన వారాహి అవతారం హిరణ్యాక్షుని హతమారుస్తాడు. దానితో హిరణ్య కశిపునికి విష్ణువుపై మరింత ద్వేషం పెరుగుతుంది. దీనితో కఠోర తపస్సు చేసి బ్రహ్మ నుంచి ఓ వరాన్ని పొందుతాడు. ఈ క్రమంలోనే తనకి పుట్టిన బిడ్డ ప్రహ్లాదుడు విష్ణు భక్తుడుగా పుడతాడు. ఇది హిరణ్య కశిపునికి నచ్చదు. అక్కడ నుంచి కథ ఎలా మారింది? ప్రహ్లాదుడు భక్త ప్రహ్లాదుడుగా ఎలా మారాడు? నరసింహా అవతారం ఎలా ఉద్భవించింది? ఇంట కానీ బయట కానీ, మనిషి చేత కానీ మృగం చేత కానీ, నేల మీద కానీ నింగిలో కానీ మరణం ఉందని హిరణ్యకశిపుని అంతం నరసింహావతారం ఎలా చేసింది అనేవి తెలియాలి అంటే ఈ చిత్రాన్ని వెండితెరపై చూడాల్సిందే. మొదటిగా ఇలాంటి ప్రయోగాన్ని ఇండియన్ సినిమా దగ్గర చేసిన నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్, క్లీం ప్రొడక్షన్స్ వారి ప్రత్యేక ప్రయత్నాన్ని అభినందించి తీరాలి. ఇండియన్ సినిమా దగ్గర యానిమేటెడ్ తరహా సినిమాలు చాలా తక్కువ అలాంటి జానర్ లో ఒక ఊహించని డివోషనల్ యాక్షన్ చిత్రాన్ని అందించే ప్రయత్నం చేయడం హర్షణీయం. ఇంకా ఈ డివోషనల్ చిత్రం బిగ్ స్క్రీన్స్ పై ఈ తరహా చిత్రాలు ఇష్టపడే వారికి మంచి ట్రీట్



ఇస్తుంది అని చెప్పవచ్చు. సినిమా ఆరంభమైన మొదటి నలభై నిమిషాలు కథనం మంచి ఎగ్జైటింగ్ గా ఉత్సాహభరితంగా కొనసాగుతుంది. ముఖ్యంగా ఫస్టాఫ్ లో వచ్చే వరాహ అవతార ఎపిసోడ్ అయితే నెక్స్ట్ లెవెల్ ట్రీట్ అందిస్తుంది. క్రేజీ యాక్షన్ సన్నివేశాలు ఆ గ్రాండ్ విజువల్ కంటికి ట్రీట్ ని అందిస్తాయి. అలాగే ప్రహ్లాదునికి మహా విష్ణువుకి సంబంధించిన అన్ని సన్నివేశాలు కూడా బాగున్నాయి. ప్రహ్లాదుని కాపాడే ఎపిసోడ్స్ వాటిని డిజైన్ చేసిన విధానం ఇంప్రెస్ చేస్తుంది. అలాగే కొన్ని కొన్ని ఎమోషనల్ మూమెంట్స్ కూడా ఆడియెన్స్ ని కదిలిస్తాయి. ఇక వీటితో పాటుగా ఈ యానిమేషన్ సినిమా కోసం సృష్టించిన ప్రపంచం అద్భుతం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. భూలోకం నుంచి స్వర్గ లోకం, బ్రహ్మలోకం ఇలా ఒక అద్భుతమైన ఫాంటసీ ప్రపంచాన్ని మేకర్స్ డిజైన్ చేసి ఆశ్చర్యపరిచారు.ఇక లాస్ట్ సెన్సేషనల్ ట్రీట్ మహావతార నరసింహా అవతారం వచ్చిన తర్వాత నుంచి సినిమా నెక్స్ట్ లెవెల్ కి వెళ్ళిపోతుంది. ఇంట్రెస్టింగ్ గా మిగతా పాత్రలు అన్ని విజువల్స్ యానిమేటెడ్ గానే ఉన్నాయి కానీ ఒక్క నరసింహా అవతారం మాత్రం నిజంగా నరుడు, సింహాన్ని కలిపితే ఎంత సహజంగా కనిపిస్తుందో ఆ రీతిలో ఉంది. ఇక అక్కడ నుంచి నరసింహ అవతార తాండవం మామూలు ట్రీట్ అందించదు. బీ, సి సెంటర్ ఆడియెన్స్ విజిల్ కొట్టి ఎంజాయ్ చేసే రేంజ్ లో ఈ అవతారాన్ని దర్శకుడు ప్రెజెంట్ చేసాడు. తనపై యాక్షన్ సన్నివేశాలు కానీ ఎలివేషన్స్ గాని ఖచ్చితంగా ఊహాతీతంగా ఉన్నాయి. అలాగే మహా విష్ణువుపై చూపించిన సన్నివేశాలు కూడా అద్భుతంగా ఉన్నాయి. ఇంకా ప్రతీ పాత్ర కూడా సరిగ్గా సరిపోయింది. యానిమేటెడ్ వెర్షన్ లో ఏ పాత్ర ఎలా ఉండాలి అని చేసుకున్న డిజైన్ చాలా బాగున్నాయి. ఒక ఇంట్రెస్టింగ్ స్టార్ట్ నుంచి దాదాపు నలభై నిమిషాల మేర కథనం అంతా బాగానే ఉంటుంది కానీ ఆ తర్వాత నుంచి మూమెంట్స్ ఒకింత డల్ అయ్యాయని చెప్పక తప్పదు. ముఖ్యంగా ఒక ఫ్లోలో వెళుతున్న సినిమాకి పాటలు టచ్ దెబ్బ తీసినట్టు అనిపిస్తుంది. భక్తి పరంగానే ఉన్నప్పటికీ వెళుతున్న కథనానికి ఇవి అడ్డుకట్టగా అనిపిస్తాయి. అలాగే అక్కడక్కడా మూమెంట్స్ కూడా కొంచెం స్లో కావడంతో ప్రీ క్లైమాక్స్ వరకు కథనం మరీ అంత ఎగ్జైటెడ్ గానూ సాగదు అలాగే నిరుత్సాహంగా కూడా అనిపించదు. ఇక వీటితో పాటుగా కొన్ని అంశాలు లాజిక్ పరంగా కూడా ఆలోచించాల్సి వస్తుంది. హిరణ్య కశిపుడు సోదరి హోళికపై ఎపిసోడ్ బాగానే ఉంది కానీ చావు లేని వరం ఉండి కూడా ఆమెని కాపాడుకోలేని నిస్సహాయతకి పొంతన లేదు. అలాగే క్లైమాక్స్ లో నరసింహా అవతారం వచ్చే ముందు ప్రహ్లాదునికి, హిరణ్యకశిపునికి మరింత డ్రామా పెట్టి ఉంటే బాగుండేది. వారి నడుమ మాటల యుద్ధం లాంటి ఎలిమెంట్స్ లేకుండా సింపుల్ గానే ముగుస్తుంది. సి వీటి విషయంలో కొంచెం ఆడియెన్స్ నిరుత్సాహ పడవచ్చు. అలాగే ఒకటీ రెండు చోట్ల యానిమేషన్ లో లోపాలు కనిపిస్తాయి. ఈ చిత్రం టెక్నికల్ గా చాలా బలంగా ఉందని చెప్పి తీరాలి. క్లీం ప్రొడక్షన్స్ ఎంత బడ్జెట్ పెట్టారో కానీ ప్రతీ రూపాయి విజువల్స్ రూపంలో కనిపిస్తుంది. ఆ ప్రొడక్షన్ డిజైన్ కానీ ప్లాన్ చేసుకున్న యాక్షన్ సీక్వెన్స్ లు, ఫాంటసీ ప్రపంచాలు పాత్రలు ప్రతీది కొత్తగా అబ్బురపరిచేలా కనిపిస్తాయి. ఖచ్చితంగా ఇలాంటి ప్రోడక్ట్ ని ఇచ్చిన హోంబళే మేకర్స్ ప్రయత్నం మెచ్చుకోని తీరాల్సిందే. అలాగే తెలుగు డబ్బింగ్ కానీ ఇంట్రెస్టింగ్ గా ఇది ఎక్కడా కన్నడ డబ్బింగ్ సినిమాలా లేనే లేదు. మాటలు పాత్రలు మాట్లాడే నోటి కదలిక పర్ఫెక్ట్ గా చేయడం ఆశ్చర్యం.అలాగే సినిమాకి మరో వెన్నుముక సామ్ సి ఎస్ సంగీతం అని చెప్పాలి. తన స్కోర్, పాటలు సినిమాని చాలా ఎలివేట్ చేసాయి. ఇక దర్శకుడు అశ్విన్ కుమార్ విషయానికి వస్తే.. తానే ఎడిటర్ గా కూడా చేశారు. అయితే తన వర్క్ ఎడిటింగ్ పరంగా ఇంకొంచెం బెటర్ గా చేయాల్సింది కానీ దర్శకత్వం పరంగా మంచి మార్కులు ఇవ్వవచ్చు. తాను క్రియేట్ చేసుకున్న ప్రపంచం అద్భుతంగా ఉంది. మంచి లైన్ అందుకు తగ్గట్టుగా ప్లాన్ చేసుకున్న కథనం బాగున్నాయి. కానీ కొన్ని మూమెంట్స్ వరకు ఇంకా జాగ్రత్త పడాల్సింది.



## గ్యాస్ కట్టర్‌తో కట్‌చేసి.. ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. శనివారం తెల్లవారుజామున ఆదిలాబాద్ పట్టణంలోని రామ్‌నగర్ కాలనీలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన దుండగులు.. సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. అనంతరం గ్యాస్ కట్టర్‌తో మెషిన్‌ను కట్ చేసి డబ్బులు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బ్యాంకు అధికారులకు విషయం తెలియజేశారు. అందులో నగదు ఎంత ఉందన్న విషయం తెలియాల్సి ఉంది. కాగా చోరీకి ఏటీఎంను డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు స్వామి, సునీల్ కుమార్ పరిశీలించారు. క్లూస్ టీమ్ రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ క్యాంటీన్లలో ఆగస్టు 15 నుంచి అల్పాహారం

ఇందిరమ్మ క్యాంటీన్లలో రూ.5కే అల్పాహారం అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ కసరత్తు వేగవంతం చేసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆగస్టు 15వ తేదీ నుంచి ఉదయం టిఫిన్ వడ్డించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. రూ.5భోజన కేంద్రాల్లోనే అల్పాహారం అందుబాటులో ఉండనుంది. క్యాంటీన్ నమూనానూ బల్దియా మారుస్తోంది. 40/10, 20/10 పరిమాణాలతో నూతన కేంద్రాలను డిజైన్ చేసింది. ఎక్కువ విస్తీర్ణం ఉంటే వడ్డించేందుకు అనువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఖైరతాబాద్ మింట్ కాంపౌండ్‌లో ఇప్పటికే ఇందిరమ్మ క్యాంటీన్ నూతన నమూనా ఏర్పాటు పూర్తయ్యింది.జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్దా పనులు తుది దశకు చేరుకున్నాయి. కొత్త నమూనాలో జీహెచ్ఎంసీ లోగో, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి




ఫొటోలతో పాటు భోజనం, అల్పాహారం ఫొటోలు ఉన్నాయి. డివిజన్‌కు ఒకటి చొప్పున గతంలో 150 భోజన కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 128 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారులకు అల్పాహారంగా తృణధాన్యాలతో చేసిన ఇడ్లీ, ఉప్మా, పొంగల్, పూరి వంటివి వడ్డించనున్నారు. వారంలో ఆరు రోజులు అల్పాహారం అందుబాటులో ఉంటుంది. ఆదివారం సెలవు. ఒక్కో టిఫిన్‌కు రూ.19 ఖర్చు కానుండగా లబ్ధిదారుడు రూ.5 చెల్లించాల్సి ఉంటుంది. మిగతా రూ.14 హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు జీహెచ్ఎంసీ చెల్లించనుంది.

రోజు మెనూ (నోట్- గ్రా- గ్రాములు, ఎంఎల్- మిల్లీ లీటర్లు)

డే-1 మిల్లెట్ ఇడ్లీ-3 (ఒక్కొక్కటి-45 గ్రా), సాంబార్-150 ఎంఎల్, పొడి-15 గ్రా.

డే-2 మిల్లెట్ ఉప్మా- 250 గ్రా, సాంబార్-150 ఎంఎల్, మిక్చర్/చట్నీ-25 గ్రా.

డే-3 పొంగల్- 250 గ్రా, సాంబార్- 150 ఎంఎల్, మిక్చర్- 25 గ్రా.

డే-4 ఇడ్లీ-3 (ఒక్కొక్కటి-45 గ్రా), సాంబార్-75, చట్నీ-75 గ్రా.

డే-5 పొంగల్- 250 గ్రా, సాంబార్- 150 ఎంఎల్, మిక్చర్- 25 గ్రా.

## వేద వీడ్కోలు

భారత మహిళల జట్టు మిడిలార్డర్ బ్యాటర్ వేద కృష్ణ మూర్తి క్రికెట్‌కు వీడ్కోలు పలికింది. 2017 వన్డే వరల్డ్‌కప్, 2020 టీ20 వరల్డ్‌కప్‌ల్లో రన్నరప్‌గా నిలిచిన భారత జట్టులో వేద సభ్యురాలు. కర్ణాటకలోని కడురు అనే చిన్న పట్టణం నుంచి భారత జట్టు జెర్సీని ధరించే స్థాయికి ఎదిగినందుకు సంతోషంగా ఉందని 32 ఏళ్ల వేద పేర్కొంది. 2011లో అరంగేట్రం చేసిన వేద.. భారత్ తరపున ఐదేళ్ల క్రితమే చివరి మ్యాచ్ ఆడింది. మొత్తంగా తన కెరీర్‌లో 48 వన్డేల్లో 829, 76 టీ20ల్లో 875 రన్స్ సాధించింది.



## రిలీజ్‌కి సిద్ధమైన కింగ్‌డమ్



ఈ ఏడాది సెకండాఫ్‌లో పెద్ద సినిమాలు సందడి చేసేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే హరిహర వీరమల్లు చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం సాధించిది. ఇక ఇప్పుడు 'రౌడీ బాయ్' విజయ్ దేవరకొండ నటించిన తాజా చిత్రం 'కింగ్‌డమ్స్ జులై 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. విడుదల దగ్గరపడటంతో ప్రమోషన్స్ వేగం పెంచారు. ఇప్పటికే విడుదలైన పాటలకి మంచి స్పందన రాగా, శనివారం ట్రైలర్ విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

## నభా నటేశ్ హాట్ లుక్స్

సినీరంగంలోకి ఇప్పుడిప్పుడే వరుస ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది ఈ హీరోయిన్. ఎలాంటి బ్యాగ్రౌండ్ సపోర్ట్ లేకుండానే నటనపై ఆసక్తితో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. కానీ ఈ బ్యూటీ నటించిన సినిమాలు అంతగా మెప్పించకపోవడంతో ఈ అమ్మడుకు ఆశించిన స్థాయిలో బ్రేక్ రాలేదు. కెరీర్ మంచి ఫాంలో ఉండగానే యాక్సిడెంట్ కారణంగా సినిమాలకు దూరమైన ఈ వయ్యారి.. కొన్నాళ్లు సినిమాలకు దూరమయ్యింది. ప్రస్తుతం బ్యాక్ టూ బ్యాక్ ఆఫర్స్ అందుకుంటూ బిజీగా ఉంటుంది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా.. హీరోయిన్ నభా నటేష్. ప్రస్తుతం యంగ్ హీరో నిఖిల్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న స్వయంభు చిత్రంలో నటిస్తుంది. ఇందులో సంయుక్త మీనన్ సైతం కథానాయికగా నటిస్తుంది. తాజాగా నభా నటేష్ కు క్రేజీ ఆఫర్ వచ్చినట్లుగా తెలుస్తోంది. టాలీవుడ్ డైరెక్టర్ గోపిచంద్ మలినేని దర్శకత్వంలో బాలీవుడ్ సూపర్ స్టార్ సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో జాట్ అనే సినిమా రూపొందుతుంది.పవర్ ఫుల్ యాక్షన్ ప్యాక్డ్ సినిమాగా వస్తోన్న ఈ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.




నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com

# సెప్టెంబర్‌లో 'స్పిరిట్' షూటింగ్

భారతదేశంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాలలో పాన్-ఇండియా స్టార్ ప్రభాస్ మరియు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా యొక్క హై-బడ్జెట్ పాన్-ఇండియా యాక్షన్ డ్రామా 'స్పిరిట్' ఒకటి. స్పిరిట్ ప్రభాస్ సిల్వర్ జూబ్లీ ఫిల్మ్. తాజాగా ఇప్పుడు, ఈ సినిమా దర్శకుడు సందీప్ ఈ చిత్రం సెప్టెంబర్ లో షూటింగ్ ని ప్రారంభిస్తున్నట్లు ఒక ఇంటర్వ్యూలో ధృవీకరించారు. ఈ వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో యానిమల్ బ్యూటీ త్రిప్తి దిమిరి మహిళా ప్రధాన పాత్రలో నటిస్తుంది. ఉపేంద్ర లిమాయే ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. సందీప్ తన భద్రాకలి పిక్చర్స్ బ్యానర్ కింద ఈ చిత్రాన్ని సహ-నిర్మించాడు. ఈ చిత్రానికి సంగీతం హర్షవర్ధన్ రమేశ్వర్ అందిస్తున్నారు. టి-సిరీస్‌కు చెందిన బాలీవుడ్ నిర్మాత భూషణ్ కుమార్ ఈ ప్రాజెక్టును బ్యాంక్రోలింగ్ చేస్తున్నారు.



# కలిసిరాని రీ-ఎంట్రీ

టాలీవుడ్‌లో రీ-ఎంట్రీ ఇచ్చేందుకు చాలా మంది చాలా ప్రయత్నాలు చేశారు. అయితే, కొందరికీ రీ-ఎంట్రీలో సాలిడ్ హిట్ పడుతుంది. కానీ, మరికొందరికీ ఈ రీ-ఎంట్రీ కలిసిరాలేదు. ఇటీవల టాలీవుడ్‌లో ముగ్గురు హీరోయిన్లు రీ-ఎంట్రీ ఇచ్చారు. కానీ, ఏ ఒక్కరికీ కూడా సాలిడ్ కమ్ బ్యాక్ మాత్రం రాలేదు. మన్మథుడు, రాఘవేంద్ర చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన అన్షు ఇటీవల 'మజాకా' చిత్రంతో రీఎంట్రీ ఇచ్చింది. కానీ, బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా ఫ్లాప్‌గా నిలిచింది. ఇక నితిన్ హీరోగా తెరకెక్కిన 'తమ్ముడు' సినిమాతో నటి లయ కూడా తన రీ-ఎంట్రీపై భారీ అంచనాలు పెట్టుకుంది. కానీ, ఈ సినిమా కూడా డిజాస్టర్‌గా మిగిలింది. మరో హీరోయిన్ జెనీలియా 'జూనియర్' చిత్రంతో టాలీవుడ్‌లో రీ-ఎంట్రీ ఇచ్చింది. కానీ, ఆమెకు ఈ సినిమాతో అనుకున్న గుర్తింపు అయితే రాలేదు. మొత్తానికి ముగ్గురు హీరోయిన్లు రీ-ఎంట్రీతో మంచి కమ్ బ్యాక్ ఇవ్వాలని చూసినా, వారికి బ్యాడ్ లక్ ఎదురైంది.



# 40 మందికి అగ్ని పరీక్ష

ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్' తెలుగు సీజన్ 9 ప్రకటించిన నాటి నుంచి హైప్ ఊపందుకుంది. కింగ్ నాగార్జున మరోసారి హోస్ట్‌గా వ్యవహరించబోతుండటంతో ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే షోకి సంబంధించిన ప్రోమో విడుదల కాగా, ఇది షోపై అమితాసక్తిని కలిగించింది. ఇప్పటి వరకూ సెలబ్రిటీలకే హౌస్‌లోకి ప్రవేశం లభించగా, ఈ సీజన్‌లో మాత్రం నిర్వాహకులు కొత్త ప్రయోగానికి దిగారు. సామాన్యులకు కూడా హౌస్‌లోకి ఎంట్రీ ఇచ్చే అవకాశాన్ని కల్పించారు. దీంతో యువత నుంచి విశేష స్పందన వస్తుంది. వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు నిర్వహించి, "బిగ్ బాస్ హౌస్‌లోకి ఎందుకు రావాలనుకుంటున్నారు?" అనే అంశంపై వీడియోలు కోరారు. దీనికి భారీ స్పందన వచ్చింది. లాది అప్లికేషన్లలో తొలి దశకు 200 మందిని ఎంపిక చేశారు. ఆ తర్వాత సెల్ఫ్ కాన్ఫిడెన్స్, ఎక్స్‌ప్రెషన్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఆధారంగా 100 మందిని షార్ట్‌లిస్ట్ చేశారు. చివరకు వీరిలో నుంచి 40 మందిని ఫైనల్ రౌండ్‌కు ఎంపిక చేశారు. వీరిలో 3 నుంచి 4 మందిని ఎంపిక చేసి, వారిని 'బిగ్ బాస్' హౌస్‌లో ప్రవేశపెట్టనున్నట్టు తెలుస్తోంది. సామాన్యుల ఎంపిక ఈ నెలలోనే పూర్తి చేయాలని షో టీం భావిస్తోంది. సెప్టెంబర్ 7న సీజన్ 9 గ్రాండ్‌గా ప్రారంభం కానుంది. షో స్టార్ మాలో టెలికాస్ట్ అవుతుండగా, జియో హాట్ స్టార్లో డిజిటల్ స్ట్రీమింగ్ కూడా ఉంటుంది.

# ఆరోజున సినిమాలు ఆపేస్తాను

మళయాళ సినిమా దగ్గర ఉన్నటువంటి టాలెంటెడ్ నటుల్లో మంచి ఆదరణ ఉన్న స్టార్ నటుడు ఫహద్ ఫాజిల్ కూడా ఒకరు. తెలుగులో పుష్ప సినిమాలతో మరింత రీచ్ ని తెలుగులో అందుకున్న ఈ నటుడు తన సినీ కెరీర్ పై చేసిన కొన్ని కామెంట్ ఇపుడు వైరల్ గా మారాయి. అయితే సౌత్ లో తన టాలెంట్ తో తెలుగు, తమిళ్, మళయాళ భాషల్లో సత్తా చాటిన ఫహద్ తన రిటైర్మెంట్ కోసం చేసిన కామెంట్స్ వైరల్ గా మారాయి. తన నటన ఎప్పుడైతే ప్రేక్షకులు బోర్ కొట్టేసింది అని అనిపిస్తుంది ఆరోజున సినిమాలు ఆపేస్తానని తాను తెలిపారు. అలాగే సినిమాలు ఆపేసి బార్సిలోనాలో ఒక క్యాబ్ డ్రైవర్ గా లైఫ్ లీడ్ చేసుకుంటానని ఫహద్ తెలిపాడు. దీనితో తన ఊహించని కామెంట్స్ ఇపుడు వైరల్ గా మారాయి. ఇక ఫహద్ నుంచి ప్రస్తుతం మారేశన్ అనే సినిమా విడుదలకి రాగ మరిన్ని సినిమాలు తన నుంచి రాబోతున్నాయి.






### మిరాయ్ నుండి వైబ్ ఉంది బేబి

# సాంగ్ విడుదల

'హనుమాన్'తో భారీ విజయాన్ని అందుకున్న తేజ సజ్జా ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతోన్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'మిరాయ్' ద్వారా మళ్లీ ప్రేక్షకులను మెస్మరైజ్ చేయడానికి సిద్ధమవుతున్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయికగా నటిస్తున్నారు. మరో విశేషం ఏంటంటే .. మంచు మనోజ్ ఇందులో ప్రతినాయకుడిగా ధీటైన పాత్రలో కనిపించనున్నారు. శ్రియ, జయరామ్, జగపతిబాబు వంటి నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచగా, తాజాగా విడుదలైన ఫస్ట్ సాంగ్ ప్రోమో సినిమాకు మరింత హైప్ క్రియేట్ చేసింది. "వైబ్ ఉందిలే బేబీ_ _ _ వైబ్ ఉందిలే_ _ _ ఈ గ్లోబ్‌ను ఊపే వైబ్ ఉందిలే_ _ _" అంటూ సాగే పాట ఫుల్ ఎనర్జీతో, స్టైలిష్ విజువల్స్‌తో ఆకట్టుకుంటోంది.



### యాదాద్రి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం..

# ఇద్దరు డీఎస్పీలు మృతి

రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. అతివేగం, ఓవర్‌టెక్, రాంగ్‌లో వెళ్లడం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసులు ఎన్ని చర్యలు చేపట్టినా ఏ మాత్రం ఆగడం లేదు. తాజాగా తెలంగాణలో మరో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం కైతాపురం దగ్గర జాతీయ రహదారిపై జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డీఎస్పీలు మృతి చెందారు. విజయవాడ వైపు వెళ్తున్న లారీని కారు ఢీకొట్టడంతో ఏపీకి చెందిన ఇద్దరు డీఎస్పీలు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఏపీకి చెందిన చెందిన డీఎస్పీలు చక్రధర్ రావు, శాంతారావు ప్రాణాలు కోల్పోయారు. అడిషనల్ ఎస్పీ ప్రసాద్, డ్రైవర్‌కు నర్సింగ్‌రావుకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఇక డ్రైవర్‌ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. స్కార్పియో వాహణం ముందు ఉన్న లారీని తప్పించబోయి డివైడర్ ఎక్కి రాంగ్ రూట్‌లోకి దూసుకెళ్లింది.



# హమాస్‌పై మండిపడ్డ ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హమాస్‌పై మరోసారి అగ్గిమీద గుగ్గిలమయ్యారు. హమాస్ కథ ముగించాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. గాజాపై మరిన్ని దాడులు చేయాలని తేల్చి చెప్పారు. శాంతిస్థాపనకు హమాస్ ఎలాంటి ఆసక్తి చూపట్లేదని అన్నారు. 'హమాస్‌కు ఎటువంటి డీల్ చేసుకునేందుకు ఇష్టం లేదు. వాళ్లు చావాలని కోరుకుంటున్నట్టు ఉన్నారు. ఇది చాలా దారుణం. ఇక మొదలెట్టిన పనిని ముగించడం మినహా మరో మార్గం లేదు' అని ట్రంప్ అన్నారు. హమాస్ చెరలో బందీగా ఉన్న ఇజ్రాయెల్ పౌరుడు ఈడన్ అలెగ్జాండర్‌ను విడిపించడంలో డొనాల్డ్ ట్రంప్ కీలక పాత్ర పోషించారు. అయితే, హమాస్ వద్ద ప్రస్తుతం బందీల సంఖ్య తక్కువేనని అన్నారు. చర్చలు చరమాంకంలోకి వచ్చిన ఈ దశలో కాల్పుల విరమణకు హమాస్ అంగీకరించడం లేదని అన్నారు. యుద్ధాన్ని కొనసాగించాలని వారు కోరుకుంటున్నట్టు ఉందని కామెంట్ చేశారు. ఈ నేపథ్యంలో ఇజ్రాయెల్ తను మొదలెట్టిన పనిని పూర్తి చేయాలని అన్నారు.

# వైజాగ్‌లో డబుల్ డెక్కర్

విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియ ఊపందుకుంది. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్, టిప్సా, శిస్ట్రా కన్సల్టెన్సీల మధ్యన శుక్రవారం అవగాహన ఒప్పందం కుదిరింది. విశాఖ, విజయవాడ మెట్రోరైళ్ల నిర్మాణం,పర్యవేక్షణ, సాంకేతిక సహకారం కోసం కన్సల్టెన్సీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఏపీ మంత్రి నారాయణ సమక్షంలో ఒప్పందంపై ప్రతినిధులు సంతకాలు చేశారు. విజయవాడ మెట్రో డిజైన్ లు,సాంకేతికత, పనుల పర్యవేక్షణ కోసం టిప్సాతో, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టుకు సంబంధించి శిస్ట్రా కన్సల్టెన్సీతో ఒప్పందం చేసుకున్నారు. విభజన చట్టం ప్రకారం విశాఖ, విజయవాడలో మెట్రో రైళ్ల నిర్మాణం ప్రతిపాదించారని మంత్రి నారాయణ తెలిపారు. కేంద్రం 20 శాతం, రాష్ట్రం 20 శాతం , మరో 60 శాతం తక్కువ వడ్డీకి కేంద్రం ఇప్పించే లోన్ సాయంతో మెట్రోలు నిర్మిస్తామని వెల్లడించారు.



విశాఖ మెట్రో రైల్ ఫేజ్ 1 కింద 46.23 కి.మీ తొలిదశ నిర్మాణానికి టెండర్లు పిలిచామన్న నారాయణ.. విశాఖలో 20 కిమీ మేరకు డబుల్ డెక్కర్ నిర్మిస్తామని అన్నారు. మూడేళ్లలో విశాఖ, విజయవాడ మెట్రోరైళ్లు నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

# తిరుపతిలో స్కూటరిస్టుపై చిరుత దాడి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో స్కూటరిస్టుపై చిరుత పులి దాడికి యత్నించింది. ప్రయాణికులు చిరుత నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. తిరుపతి జూపార్క్ రోడ్డులో చిరుత బైకుపై వెళ్తున్న వ్యక్తిపై దాడికి పాల్పడింది. స్కూటరిస్టు స్పీడ్ గా వెళ్లడంతో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. వెనుకాల కారులో వస్తున్న ప్రయాణీకులు మొబైల్ ఫోన్ తో వీడియో రికార్డు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. వరుస ఘటనలో ప్రయాణికులు, భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ విస్తీర్ణం తగ్గడంతోనే చిరుతలు జనవాసాల్లోకి వస్తున్నాయని నెటిజన్లు మండిపడుతున్నారు. అటవీ విస్తీర్ణం పెంచడంతో అటవీ జంతువులను రక్షించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

